సాక్షి నల్లగొండ

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



మత్తు ఇంజక్షన్లకు బానిస

మత్తుకు సంబంధించిన ఔషధాలను కలిగిన ఉన్న ఇద్దరిని నల్లగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



అవిశ్వాసం నెగ్గింది..

రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది.. కోర్టు స్టే రావడంతో ఫలితం ఆగింది. - 8లో



భక్తిభావాలతో జీవనం..

సకల ప్రాణులూ క్రీస్తు సందేశాలతో భక్తి భావాలతో జీవించాలని ఖమ్మం మాజీ బిషప్ పాల్‌మైవన్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు

నల్లగొండ టౌన్ : తెలంగాణ ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్‌కామ్ జపాన్ దేశంలో హాస్పిటాలిటీ రంగంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా లేదా డిగ్రీ, 22 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. పేర్ల నమోదు కోసం టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ 8125251408 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

నల్లగొండ టౌన్ : ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన కోసం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) పోరాడుతుందని.. ఆ సంఘం రీజినల్ కార్యదర్శి బాసాని వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన డిపో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ సంఘాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎల్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.నర్సింహ, ఉపాధ్యక్షులుగా జి.లింగయ్య, ఎ.సత్తయ్య, సహాయ కార్యదర్శిగా బి.లింగయ్య, సభ్యులుగా ఎండీ సాధిక్‌బాష, బి.భూపాల్, టీఎం రెడ్డి, డీఎం రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


చేనేత పాలసీ రూపొందించాలి

నల్లగొండ టూటౌన్ : చేనేత రక్షణ కోసం సమగ్రమైన చేనేత పాలసీ రూపొందించాలని కోరుతూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల్లో, కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి టెస్కో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.1200 కోట్లు కేటాయించాలని, చేనేత ముడి సరుకులపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూరపాటి రమేష్, కందగట్ల స్వామి, కమతం మురళి, గర్దాస్ బాలయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

8న పోలీస్ వాహనాల పాత సామగ్రి వేలం

సూర్యాపేట క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో ఈ నెల 8న పోలీస్ వాహనాల పాత సామగ్రిని బహిరంగ వేలం వేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వాహనాలకు ఉపయోగించిన 113 టైర్లు, ట్యూబ్‌లు, 46 బ్యాటరీలతోపాటు ఇతర సామగ్రి ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వేలంలో ఎవరైనా నేరుగా పాల్గొనవచ్చని, వివరాలకు పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి సురేష్ సెల్ : 8712686019 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కందులు క్వింటా రూ.10,217



తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు రికార్డు ధర పలికింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకు 544 బస్తా కందులు రాగా క్వింటాకు గరిష్టంగా రూ.10,217 కనిష్టంగా రూ.8,089 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉంటే అంత కంటే అధిక ధర పలకడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి అని ఆయన తెలిపారు.

10న కోదాడ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

కోదాడ: గత నెల 27న కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీ అయిన ఆ రెండు పదవులకు ఈ నెల 10న ఎన్నిక నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు కోదాడ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఉదయం పది గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఆర్డీఓ సమక్షంలో ఈ ఎన్నిక జరగనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మకానికి 'అసైన్డ్'!

పునరావాసం కింద కేటాయించిన భూముల విక్రయం

- ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన కొనుగోలుదారులు
- ఓపెన్ మార్కెట్లో ఎకరం రూ.2 కోట్లు పలుకుతున్న అసైన్డ్ భూములు
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న రెవెన్యూ అధికారులు



చింతపల్లి మండల కేంద్రంలో సర్వే నంబర్ 154లో వెలిసిన నిర్మాణాలు

చింతపల్లి : పునరావాస బాధితుల కోసం కేటాయించిన భూములవి.. ఓపెన్ మార్కెట్లో వాటి విలువ ఎకరం రూ.కోటి పైనే. చింతపల్లి మండలం కేంద్రంలోని హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి వెంట సర్వే నంబర్ 154లో ఉన్న ఆ అసైన్డ్ భూమిలను కొందరు అమ్మకానికి పెట్టారు. వాటిని కాగితాలపై కొనుగోలు చేసిన వారు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణాలు చేపడితే కూలగొట్టరనే నెపంతో ఒకరిని చూసి మరొకరు ఇలా కట్టడాలు చేస్తున్నారు. ఇదంతా చూస్తున్న రెవెన్యూ శాఖ నామమాత్రపు చర్యలు చేపట్టి వదిలేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

సర్వే నంబర్ 154లో 97 ఎకరాల అసైన్డ్ భూమి

చింతపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 154లో 97 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఆ భూమి బహిరంగ మార్కెట్లో ఒక ఎకరం రూ.కోటి నుంచి రూ.2కోట్లు పలుకుతుంది. అయితే డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చింతపల్లి మండలంలోని కిష్టరాయినిపల్లి, నాంపల్లి మండలంలోని లక్ష్మాపురం, దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల లింగన్నబావి గ్రామాల రైతులు పొలాలతో పాటు నివాసాలను కోల్పోవాల్సి వచ్చింది. వారికి చింతపల్లిలోని సర్వే నెం. 154లో 97 ఎకరాల భూమిలో పునరావాసం కల్పించేందుకు కసరత్తు మొదలైంది. అప్పటికే అక్కడ సాగు చేసుకుంటున్న వారికి ఎకరాకు రూ.9.80 లక్షల చొప్పున ఇచ్చి ఆ భూమిని ప్రభుత్వం తీసుకుని నిర్వాసితులకు ఇస్తోంది.

గుంటకు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు

ప్రభుత్వం తీసుకుంటున్న సర్వే నంబర్ 154లోని భూములను కొందరు రైతులు ఇతరులకు విక్రయిస్తున్నారు. గుంట భూమికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు చెల్లిస్తున్నారు. హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారికి ఇరువైపుల ఈ భూమి విస్తరించి ఉండడంతో ఇక్కడ గజం భూమి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలుకుతుంది. కానీ, అసైన్డ్ భూములు తక్కువ ధరకు అది రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉండడంతో అమాయక ప్రజలు పోటీపడి మరి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ అసైన్డ్ భూమిని కొనుగోలు చేసిన కొందరు షెట్టర్లు సైతం నిర్మించారు. ఇక్కడ నిర్మించిన ఒక్కో షెట్టర్ రూ.20లక్షల నుంచి రూ.35లక్షల ధర పలుకుతోంది.

అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవు



చింతపల్లి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 154లో అక్రమకట్టడాలు చేపడితే చర్యలు తప్పవు. డిండి ఎత్తిపోతల నిర్వాసితుల పునరావాస కేంద్రం కోసం ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి పరిహారం కూడా అందించాం. అసైన్డ్ భూమిలో సేద్యం చేసే రైతులకు పరిహారం అందిస్తున్నాం.ఆ భూమి బయటి వ్యక్తులకు విక్రయించినా, అక్రమ కట్టడాలు చేపట్టినా చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాములు, ఆర్డీఓ, దేవరకొండ

బాండ్ పేపర్లపై రాసుకుని..

అసైన్డ్ భూములను క్రయవిక్రయాలు చేయకూడని తెలిసినా యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. బాండ్ పేపర్లపై రాసుకుంటూ ఈ దందాకు తెరలేపారు. కొన్నేళ్లుగా అసైన్డ్ భూమిలో సాగుతున్న అక్రమ దందాపై మౌనం వహిస్తూ వచ్చిన రెవెన్యూ అధికారులు ఆలస్యంగా స్పందిస్తున్నారు. కాగా జనవరి 29న రాత్రి సమయంలో సదరు సర్వే నంబర్‌లో ఓ వ్యక్తి రైతు వద్ద నుంచి కొనుగోలు చేసిన భూమిలో రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా బోరు వేస్తుండగా.. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఆ బోర్‌ను సీజ్ చేశారు.

కాల్వలకు నీరివ్వాలని మంత్రికి వినతి

- నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని సాగర్ ఎస్ఈకి మంత్రి ఉత్తమ్ ఆదేశం



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వ, ఎస్ఎల్‌బీసీ, వరద కాల్వకు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రానున్న వేసవికాలంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాలు పెంచేందుకు తక్షణమే ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులు, కుంటలను నింపితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ ఎన్ఎస్పీ ఎస్ఈకి ఫోన్ చేసి నీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండా శ్రీశైలం, పారేపల్లి శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం విక్రయించొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్.

నల్లగొండ : పీడీఎస్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా, కొనుగోలు చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ డీటీలు, గోదాం ఇన్‌చార్జిలు, రేషన్ డీలర్ల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రేషన్ షాపు ముందు బోర్డ్ కలిగి ఉండాలని, డీలర్లు సమయపాలన పాటించాలని, సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. డీలర్లు అథరైజేషన్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలు ప్రతి నెల 10వ తేదీలోగా బియ్యం రేషన్ షాపులకు చేరేలా చూడాలన్నారు. జిల్లాలో మొత్తం 13,93,630 యూనిట్లు ఈ కేవైసీ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 9,68,698 (69.51శాతం) పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 4,24,932 ఈ కేవైసీ చేయాల్సి ఉందన్నారు. ప్రతి డీలరు ఈ నెలాఖరులోగా ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలర్లు, గోదాం ఇన్‌చార్జిలు

ఎన్నికల హామీలను నిలబెట్టుకోని కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

దేవరకొండ : ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. దేవరకొండకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వస్తే రైతుబంధు, రైతుబీమా అమలుపై నిదీయాలని ప్రజలకు సూచించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేల కోట్ల అప్పులు చేసిందన్నారు. నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందన్నారు. సమావేశంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, జెడ్పీటీసీలు కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి, మాధవరం సునీతాజనార్దన్‌రావు, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, నాయకులు గాజుల ఆంజనేయులు, వడ్త్యా రమేష్‌నాయక్, ముత్యాల సర్వయ్య, టీవీఎన్ రెడ్డి, హన్మంతు వెంకటేష్‌గౌడ్, మారుపాకుల సురేష్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



శ్రీస్వామి వారిని అభిషేకించేందుకు ప్రత్యేక కలశంలో జలాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయ ముఖ మండపంలో 108బంగారు, వెండి కలశాలలో శుద్ధజలం, సుగ్రంధ ద్రవ్యాలను పోసి పూజలు చేసిన వాటితో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకించారు. అంతకుముందు ఆలయంలో హోమం నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఇక ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలను విశేషంగా కొనసాగించారు.

ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం



గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో శుక్రవారం నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అందులో భాగంగా కట్టంగూరు పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ పోరెళ్ల సునీత - కట్టంగూరు

కిట్లు సరే.. డబ్బులేవీ!

- కేసీఆర్ కిట్‌ను.. ఎంసీహెచ్ కిట్‌గా మార్చిన ప్రభుత్వం
- పేరు మారినా విడుదల కాని నిధులు
- కేవలం వస్తువుల కిట్ మాత్రమే అందజేత
- 18 నెలలుగా డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్న బాలింతలు



నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచడం, భ్రూణహత్యలను నివారించడం, తల్లీబిడ్డకు సరైన వైద్యంతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా మాతా శిశు మరణాలను తగ్గించాలన్న లక్ష్యంతో అప్పటికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేసింది. 2017 సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకుంటే కేసీఆర్ కిట్‌తో పాటు ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలకు తల్లి ఖాతాలో ప్రభుత్వ జమచేస్తుంది. అయితే 18 నెలలుగా తల్లులకు ఆ డబ్బు అందడం లేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన తల్లులకు వస్తువుల కిట్ అందజేస్తోంది. కానీ డబ్బుల గురించి ప్రస్తుత ప్రభుత్వం ఊసెత్తడం లేదు. ప్రభుత్వ తీరుతో బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు విడుతలుగా జమ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన తల్లులకు అప్పటి ప్రభుత్వం నాలుగు విడుతలుగా ఆడబిడ్డపుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలకు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మొదటి దఫా ఆస్పత్రిలో చెకప్ చేయించుకున్న తరువాత, రెండో దఫా ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయ్యాక, మూడో దఫా మూడు నెలలు చిన్నారికి టీకాలు పూర్తయ్యాక, నాలుగవ దఫా చిన్నారికి అన్ని రకాల టీకాలు పూర్తిస్థాయిలో వేయించిన తరువాత డబ్బును ఖాతాల్లో జమచేశారు.

రూ.కోట్లలో పెండింగ్

18 నెలలుగా కిట్‌లకు సంబంధించిన ప్రోత్సాహకం డబ్బులు విడుదల కాకపోవడంతో కోట్లాది రూపాయల డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో డెలివరీ చేయించుకున్న తల్లులు డబ్బుల గురించి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ వైద్యులను రోజూ అడుగుతున్నా వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. పథకం ప్రారంభం నుంచి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,63,196 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ కాగా కేవలం 2,73,612 మంది తల్లులకు ప్రోత్సాహం డబ్బులను ఖాతాల్లో జమచేశారు. ఇంకా 89,584 మంది తల్లులు ప్రోత్సాహకం డబ్బులు అందలేదు.

పూర్వ స్థితికి వచ్చే ప్రమాదం..

గతంలో కేసీఆర్ కిట్ పథకం లేనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చాలా తక్కువగా జరిగేవి. 60 శాతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో అయితే 40 శాతం మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేవి. కేసీఆర్ కిట్ పథకం అమలు తరువాత పరిస్థితి మారిపోయింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో 40 శాతం డెలివరీలు అవుతుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 60 శాతం ప్రసవాలు అయ్యే పరిస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రోత్సాహకం డబ్బులను విడుదల చేయకపోతే పూర్వ స్థితికి వచ్చే ప్రమాదం లేకపోలేదని ప్రభుత్వ ఆస్పత్రుల వర్గాలు పేర్కొంటున్నాయి.

నిధులు విడుదల కాగానే జమచేస్తాం



ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన వారి ఖాతాల్లో డబ్బులను జమచేస్తాం. చాలా రోజులు నుంచి నిధులు విడుదల కావడం లేదు. దీనిపై ప్రభుత్వానికి నివేదికను అందించాం.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్ఓ

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 227 మంది గైర్హాజర్

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టిల్ పరీక్షలకు రెండవ రోజు శుక్రవారం 227 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో జరిగిన మొదటి సంవత్సరం ఒకేషనల్, ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్‌కు 3,177 మంది హాజరు కావాల్సి ఉండగా.. 2950 మంది హాజరయ్యారు. 227 మంది గైర్హాజర్ అయ్యారు.

విద్యార్థులకు పోటీలు

నల్లగొండ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన విద్యార్థులకు నల్లగొండలో డైట్ కళాశాల వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్‌లో ఉప అంశాలు వ్యర్థాలను తగ్గించడం, ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం, సుస్థిర- అభివృద్ధినిచ్చే ఆహారపు అలవాట్లు, ప్లాస్టిక్ వద్దు, నీటి పరిరక్షణం తదితర విభాగాలపై ఈనెల 5 పాఠశాల స్థాయి, 7న మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి (సెల్ నంబర్ 9848578845)ని సంప్రదించాలని సూచించారు.

ముంపు సమస్యకు పరిష్కారం



కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పైప్ కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డును తవ్వుతున్న జేసీబీ

- హైవేపై కల్వర్టు నిర్మాణం

నిడమనూరు : వరద నీటితో రోడ్డు ధ్వంసం కాకుండా మండల కేంద్రం సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పైప్ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో వరదలు వచ్చినప్పుడు నిడమనూరు చెరువుకు గండిపడిన సమయంలో, సాగర్ ఎడమకాల్వలకు కట్ట తెగినప్పుడు వచ్చిన వరదకు ఇక్కడ రోడ్డు తెగిపోయింది. ఆ సమయంలో ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. నిడమనూరు, నర్సింహులగూడెంలలో ఇండ్లలోకి నీరు చేరి భారీ నష్టం వాటిల్లింది. దీంతో గ్రామస్తులు ఆందోళనలు చేపట్టడంతోపాటు నాటి ఎంపీ ఉత్తకుమార్‌రెడ్డికి పరిస్థితిని వివరించారు. ఆయన కేంద్ర జాతీయ రహదారుల శాఖ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆ ప్రదేశంలో రహదారిపై పైప్ కల్వర్టు నిర్మాణానికి అనుమతి లభించింది. పైప్ కల్వర్టు నిర్మిస్తే వరదలు వచ్చినప్పుడు నీరు సాఫీగా వెళ్లి ముంపు బెడద తప్పుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

నార్కట్‌పల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాతిశ్యాహం అనే వ్యక్తి స్థానిక రాశీ రీఫ్యాక్టర్ కంపెనీలో ఉద్యోగ రీత్యా కొన్ని ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడ పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం డ్యూటీకి రాకపోవడంతో తన స్నేహితుడు సొంత ఊరికి వెళ్లాడనుకొని ఇంటికి ఫోన్ చేశాడు. అక్కడకి రాలేదన్న సమాచారంతో తోటి ఉద్యోగి రామ్ జట్ కెహాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఔషధ దుకాణాలపై అధికారుల దాడులు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ: పట్టణంలోని పలు ఔషధ దుకాణాల్లో శుక్రవారం అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ మందుల దుకాణంపై కేసు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ బిల్లులు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని దుకాణాల్లో ఆర్‌ఎంపీలకు అధిక మోతాదులో మందులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. తనిఖీల్లో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ దాసు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అండర్ 9, 11, 13, 15 విభాగాల్లో బాల, బాలికలు పాల్గొనాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆదివారం ఉదయం 10గంటల లోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సూర్యాపేట అర్బన్, రూరల్‌లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ 18 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి కోటాచలం శుక్రవారం తెలిపారు. ఈ నెల 12న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

182 మంది బాల కార్మికులను గుర్తించాం

సూర్యాపేట క్రైం: జిల్లాలో నెల రోజులు పాటు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా నిరాదరణకు, వెట్టిచాకిరీకి గురవుతున్న 182మంది బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించామని జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలురు 85మంది, బాలికలు 11మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన బాలురు 65మంది, బాలికలు 21మంది ఉన్నారని పేర్కొన్నారు. బాలలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామన్నపేటలో పెద్దపులి కలకలం!

- పులి సంచరిస్తుందన్న సమాచారంతో వణికిపోతున్న జనం
- గాలిస్తున్న అటవీ, పోలీసుశాఖ సిబ్బంది


రైల్వేట్రాక్‌పై పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, స్థానికులు

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రం శివారులో పెద్దపులి సంచారం కలకలం సృష్టిస్తోంది. గూడ్స్ రైలు గార్డ్ (సీఎంసీఎస్) సమాచారంతో పోలీసు, రైల్వే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి కదలికలను గుర్తించేందుకు ఆయా శాఖల అధికారులు సిబ్బంది రంగప్రవేశం చేశారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. చిట్యాల నుంచి బీబీనగర్ వైపు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గూడ్స్ రైలు వెళ్లింది. రైలు చివరి క్యాబిన్‌లో గార్డ్ డ్యూటీ చేస్తున్న వ్యక్తి 45కి.మీ మైలురాయి వద్ద (హరిహరపుత్ర రైసుమిల్లు) పెద్దపులి రైల్వేట్రాక్‌ను దాటి కొమ్మాయిగూడెం వైపు వెళ్లడం చూశానని రామన్నపేట రైల్వేస్టేషన్ మాస్టర్‌కు తెలిపాడు. ఈ విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులతో పాటు పోలీసు, అటవీశాఖ అధికారులకు చేరవేశాడు. వారు ట్రాక్‌పై పనిచేసే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని మెసేజ్ పంపారు. సమాచారం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, అటవీశాఖ పోలీసు సిబ్బంది, స్థానికులతో కలిసి 45వ నంబర్ మైలురాయి పరిసరాల్లో పర్యటించారు. పులి కనిపించిన ప్రాంతం వద్ద రైతులు, గొర్ల కాపరుల సంచారం ఎక్కువగా ఉండడంతో అధికారులు వారిని అప్రమత్తం చేశారు. పులి సంచారానికి సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొమ్మాయిగూడెం, పెద్దకాపర్తి, సిరిపురం, జనంపల్లి, బోగారం తదితర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. పులి సంచారంపై డీఎఫ్‌ఓ శోభారాణిని సంప్రదించగా ఈ ప్రాంతంలో పెద్దపులులు లేవని, అలాగని పులి సంచరించలేదని చెప్పలేమని తెలిపారు. అటవీశాఖ సిబ్బంది పులి కదలికలను తెలుసుకునేందుకు ఫీల్డ్‌మీదికి వెళ్లినట్లు చెప్పారు. కాగా.. రాత్రి వరకు పులిజాడ తెలియరాలేదు. పులిని చూసిన గార్డ్ మొబైల్‌ఫోన్ క్యాబిన్‌లోని బ్యాగులో ఉండడం, రైలు 50 నుంచి 60 కి.మీ వేగంతో వెళ్లడంతో ఫొటో తీయలేకపోయినట్లు తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

"రామన్నపేట శివారులో పులి కనిపించిందనే సమాచారం అందింది. వెంటనే పోలీసు సిబ్బంది పులి కనిపించిన ప్రదేశానికి వెళ్లి చూశాం. రైతులు, గొర్లకాపరులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయబావుల వద్దకు గుంపులుగా వెళ్లాలి. పులి కనిపిస్తే సమాచారం అందించాలి.

– వెంకటేశ్వర్లు, సీఐ, రామన్నపేట

ఘనంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నల్లగొండ పట్టణంలోని గుత్తా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రక్తదానం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, యామ కవిత దయాకర్, నాయకులు అయితగాని స్వామిగౌడ్, హరికృష్ణ, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, అనిస్‌ముక్తర్, హుస్సు, వంగాల సహదేవరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు, మాలె శరణ్యారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, చిత్రంలో చాడ కిషన్‌రెడ్డి తదితరులు

మత్తు ఇంజక్షన్లకు యువత బానిస


మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్‌లను చూపుతున్న నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

- నల్లగొండలో పలువురి యువకుల వద్ద మత్తు టాబ్లెట్లు, ఇంజక్షన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వైద్యుడి సిఫారసు లేకుండా మత్తుకు సంబంధించిన స్పాస్మో ప్రాక్సివాస్ ప్లస్, అల్ట్రా కింగ్ టాబ్లెలెట్‌లు, ట్రామాడెక్స్ ఇంజక్షన్‌లు కలిగిన ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా కొత్త తరహాలో మత్తు మందుకు యువత బానిస అవుతున్నట్లు బయటపడింది. నిందితులను, మత్తు మందులను అమ్మిన వారిని అరెస్టు చేసి, వారి దగ్గర మత్తు మందులకు సంబంధించిన టాబ్‌లెట్స్, ఇంజక్షన్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి శుక్రవారం వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని రహ్మాన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ జబీఉల్లా, ఎన్‌జీ కాలేజీ వెనుక బాగంలోని శ్రీనగర్‌కాలనీ చెందిన మహ్మద్ సల్మాన్ మత్తు మందులతో పట్టుబడినట్లు తెలిపారు. వీరిద్దరు శివాజీనగర్‌లోని న్యూ హెల్త్‌కేర్ ఫార్మసీకి చెందిన యజమాని తాడోజు నరేష్ వద్ద మత్తు మందులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కొందరు యువకులు మత్తు టాబ్లెట్లను, ఇంజక్షన్లను తాము తీసుకోవడమే కాకుండా తమ ఇళ్లలో నిల్వ చేసుకుని ఇతరులకు కూడా విక్రయిస్తున్నారని ఎస్పీ చెప్పారు. ఈ మత్తు టాబ్లెట్లను మింగి పైనుంచి చక్కెర నీళ్లు తాగడం వల్ల ఎక్కువ మత్తు వస్తుందని, గంజాయి పీల్చిన దానికంటే ఎక్కువ మత్తులోకి జారుకుంటారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని, క్రయ, విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. మత్తు పదార్థాల సమాచార విషయంపై సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, 100 నంబర్‌కు డయల్ చేసి గానీ తెలియజేయాలని కోరారు. కొత్త తరహాలో మత్తుకు బానిస అవుతున్న యువతను కట్టడి చేసి మంచి మార్గంలో నడిపించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. నేరస్తులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్‌కే లాభం



మాట్లాడుతున్న సీతారాములు

భువనగిరిటౌన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం ఆశాజనకంగా లేదని, కార్పొరేట్ కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే విధంగా ఉందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేవిధంగా బడ్జెట్ ఉందన్నారు. విద్య వైద్య రంగాలను, ఉపాధి అవకాశాలను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థులు, పేదలు, కార్మిక వర్గానికి ఆమదూరంలో ఉందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండీ పాషా, పగిళ్ల లింగారెడ్డి, బబ్బులు పోశెట్టి, బొడ్డుపల్లి వెంకటేష్, గుంటూజు శ్రీనివాసాచారి, గుండు వెంకటనర్సు, గంగాదేవి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంటలను వేధిస్తున్న ముఠా

- సన్నిహితంగా ఉన్న సమయంలో రహస్యంగా వీడియోలు తీస్తున్న యువకులు
- బ్లాక్‌మెయిల్ చేసి నగదు, బంగారు ఆభరణాలు దోపిడీ
- మహిళలపై లైంగికదాడికి పాల్పడుతున్న గ్యాంగ్
- పరువుపోతుందని బయటికి చెప్పని బాధితులు

నల్లగొండ క్రైం: ప్రేమజంటలు సన్నిహితంగా ఉన్న సమయంలో ఓ సైకో గ్యాంగ్ సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీడియోలు చూపించి వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు దోచుకుంటున్నారు. అంతేకాకుండా మహిళలు, యువతులపై లైంగికదాడికి పాల్పడుతున్నారు. నల్లగొండ పట్టణంలోని నార్కట్‌పల్లి – అద్దంకి ప్రధాన రహదారి పానగల్ బైపాస్ సమీపంలోని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ వద్ద ఈ గ్యాంగ్ వ్యవహారం బయటపడింది. వీరు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఆరుగురు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నల్లగొండ పట్టణానికి చెందిన కొందరు ప్రేమ జంటలు, వివాహేతర సంబంధం ఉన్న వారు చెట్లపొదల మధ్య సన్నిహితంగా ఉండడాన్ని పసిగట్టి సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియో తీసి ఆయా జంటలను బ్లాక్ మెయిల్ చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్నారు. ఎవరికైనా చెప్తే మీ ఇంట్లో వాళ్లకు ఈ వీడియోలు పంపుతామని, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇస్తేనే వీడియోలను డిలీట్ చేస్తామని వారికి ఫోన్ కాల్స్ చేస్తున్నారు. దీంతో పరువుపోతుందని, వివాహేతర సంబంధం బయట పడుతుందనే ఉద్దేశంతో ఈ విషయాలను బాధితులు ఎవరికీ చెప్పడం లేదు. గత మూడేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

వెలుగులోకి ఇలా..

ఓ యువకుడు తన ప్రియురాలిని తీసుకొని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. వారు సన్నిహితంగా ఉన్న సమయంలో గ్యాంగ్‌లోని యువకులు యువతిని బలవంతంగా కొట్టి లైంగిక దాడికి పాల్పడి వీడియో తీశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు లాక్కున్నారు. అదే సమయంలో వివాహేతర సంబంధం కలిగిన మరో జంట పై ఇదే తరహాలో దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఓ వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకురావడంతో ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారిస్తున్నట్లు తెలిసింది. దోపిడీ చేసిన నగదు, బంగారు ఆభరణాలు రికవరీ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. అనేక మంది మహిళలు బాధితులుగా ఉన్నట్లు ఫోన్ కాల్‌డేటా ఆధారంగా తెలుస్తోంది. ఈ విషయంపై నల్లగొండ టూటౌన్ ఎస్సై నాగరాజును వివరణ కోరగా.. ఆ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసుల బృందం గాలిస్తున్నట్లు తెలిపారు.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు

శాలిగౌరారం: మహిళను వేధించిన కేసులో శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన నిందితుడికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన నాగయ్య(35) 2015లో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ మహేశ్ 36/2015 ఐపీసీ 354 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం మహిళను వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు బాషబోయిన నాగయ్యకు శుక్రవారం నకిరేకల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ సంవత్సరం జైలు శిక్షతో పాటూ రూ.2 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మణ్ వాదించారు. నేరం రుజువు చేసేందుకు ఆధారాలను నిర్ణీత సమయంలో కోర్టులో సమర్పించిన లైజనింగ్ అధికారి రవి, కోర్టు కానిస్టేబుల్ రమేశ్‌లను ఎస్‌ఐ సతీష్ అభినందించారు.

4న కూరెళ్లకు రాష్ట్ర ప్రభుత్వ సత్కారం

రామన్నపేట : పద్మవిభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన తెలుగు తేజాలను ఈ నెల 4న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు స్వయంగా ఫోన్ చేసి సత్కార కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ విషయాన్ని వెల్లంకిలోని కూరెళ్ల గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి ధ్రువీకరించారు.

ఈ-పాలనతో మెరుగైన సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్


సమావేశానికి హాజరైన అధికారులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈ-పరిపాలన ద్వారా ప్రత్యేక అధికారులు ఆకస్మిక పర్యటనలు చేసి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చేశారని కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి జిల్లా ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-పరిపాలనలో భాగంగా ఈ-ఆఫీస్, ఈ-పరిశీలన, వెబెక్స్ ద్వారా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించామన్నారు. జిల్లా ప్రత్యేక అధికారులు గ్రాఫ్ తయారు చేసి ఇవ్వాలని వీటిని ఒక డాక్యుమెంటరీ చేసి ప్రధానమంత్రి ఎక్సలెన్స్ అవార్డుకు పంపుతామన్నారు. నేటి నుంచి జిల్లాలో ప్రత్యేక అధికారుల బాధ్యతలు పెరిగాయన్నారు. ప్రతి బుధవారం రెండు లేక మూడు గ్రామ పంచాయతీలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఈఓ అశోక్, డీటీడీఓ శంకర్ పాల్గొన్నారు.

6న సెమినార్

సూర్యాపేట జిల్లాలోని డ్రాయింగ్-డిస్‌బర్స్‌మెంట్ అధికారుల (డీడీఓల)కు ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో ట్యాక్స్ డెడికేటెడ్ ఎట్ సోర్స్(టీడీఎస్)పై ఈ నెల 6 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సెమినార్‌కు అన్ని శాఖల డీడీఓలు హాజరు కావాలని సూచించారు.

అవిశ్వాసం నెగ్గింది.. ఫలితం ఆగింది

- రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- హైకోర్టు ఉత్తర్వులతో వెల్లడించని ఫలితం
- వైస్ చైర్మన్‌ను అనర్హుడిగా ప్రకటించిన డీసీఓ


విజయ సంకేతం చూపిస్తున్న డైరెక్టర్లు

గరిడేపల్లి: మండలంలోని రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పటికీ ఫలితం ఆగింది. అవిశ్వాసంపై శుక్రవారం జిల్లా సహకార అధికారి అధికారి శ్రీధర్ కీతవారిగూడెంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే మొత్తం 13 మంది డైరెక్టర్లకుగాను ఒకరు ఇటీవల చనిపోగా మిగిలిన 12మందిలో కాంగ్రెస్‌కు నలుగురు, బీఆర్‌ఎస్‌కు ఎనిమిది మంది ఉన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురు కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌కు చెందిన తొమ్మిది మంది డైరెక్టర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్, మరో బీఆర్‌ఎస్ డైరెక్టర్ సమావేశానికి హాజరు కాలేదు. అయితే అవిశ్వాసం నెగ్గినప్పటికీ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించడంతో ఫిబ్రవరి 5 వరకు ఫలితాన్ని వెల్లడించవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చైర్మన్‌పై అవిశ్వాస ఫలితాన్ని అధికారికంగా వెల్లడించలేదని జిల్లా సహకార అధికారి పేర్కొన్నారు. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిందని, వైస్ చైర్మన్‌ని అనర్హుడిగా ప్రకటించారు. ఈ నెల 5 తర్వాత హైకోర్టు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

పీఏసీఎస్‌ను భ్రష్టు పట్టించారు..

రాయినిగూడెం పీఏసీఎస్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, చైర్మన్ భ్రష్టు పట్టించారని పీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సమావేశం అనంతరం కాంగ్రెస్ డైరెక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. అవిశ్వాసాన్ని ఎదుర్కొలేక కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్‌కు చైర్మన్ పదవి దక్కించుకోవడం ఖాయమన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో రాయినిగూడెం పీఏసీఎస్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జుట్టుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

- మోతాదు ప్రకారం పురుగు మందులు వాడితే మంచి దిగుబడులు
- నడిగూడెం వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు


సాగులో ఉన్న వరి చేను


అగ్గి తెగులు సోకిన వరి పైరు



నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలో, పలు ప్రాంతాల్లో పిలకల దశలో ఉంది. చల్లని వాతావరణం ఉండడంతో వరి పంటలో చీడపీడలు ఆశించి నష్ట పరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని.. మోతాదు ప్రకారమే వాడాలని, నివారణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు తెలిపారు.

ఆశించే పురుగులు..

కాండం తొలుచు పురుగు: ఈ పురుగు నారుమడి, పిలక దశ, అంకురం నుంచి చిరు పొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వు చనిపోతుంది. అంకురం నుంచి చిరు పొట్టదశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలు పోతుంది. ఈ పురుగు ఆలస్యంగా నాట్లు పెట్టినా లేదా ముదురు నాట్లు పెట్టినా ఆశిస్తాయి. నత్రజని ఎరువులు తక్కువగా వాడడం వలన కాండం బలహీనంగా మారినప్పుడు ఈ పురుగు ఆశిస్తుంది.

నివారణ చర్యలు: నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలు తుంచి వేయాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతి వారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించి నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్‌ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ (దోమపోటు): ఈ పురుగు నారు మడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చటం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం, తాలుగింజలు లేదా నూర్చినప్పుడు నూకపోవడం జరుగుతుంది.

నివారణ చర్యలు: దోమను తట్టుకునే రకాలు సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు లేదా గొట్టపు రోగం : ఇది నారుమడి, పిలక దశలో ఆశిస్తుంది. అంకురం ఉల్లికాడ లాగా పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి. సెప్టెంబరులో 200 మి.మీ. కంటే ఎక్కువ వర్షం పడితే ఇది వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు: దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

పాముపొడ తెగులు: దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.

నివారణ చర్యలు: విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రాపికొనాజోల్ 1 .మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు : తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇది విస్తరించి మచ్చలు చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపించి నష్టపరుస్తుంది. వరి దుబ్బుల్లో, వరి గడ్డిపైన, కలుపు మొక్కల్లో స్థావరం ఏర్పరచుకొని అనుకూల పరిస్థితుల్లో వరి పైరుపై ఆశిస్తుంది. నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడటం, గాలిలో తేమ అధికంగా ఉండడం , మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు, ఉష్ణోగ్రత 25–30 సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తిస్తుంది.

నివారణ చర్యలు: విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలంలో నీటిని తీసివేయాలి. బాగా ఆరనివ్వాలి. దీని వలన శిలీంద్రం తాలూకు సిద్ధబీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసీన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.